# ఒకసారి, రెండు సార్లు..

ఇవ్వాళ ఏకాంబరప్పను చూసి ఎవరయినా గర్వపడవచ్చుగానీ, పాతికేళ్ళ కిందటయితే, అతనెందుకూ పనికిరాని వాడికిందే లెక్క. ఈ మాట ఇంకెవరో, ఎవరో అంటే మనం తుడిచిపారేస్తాం. స్వయంగా అతని మేనమామగారే అన్నారు. పోనీ ఏకాంబరప్పకూ నరసప్పగారికీ, తగాదా లేమన్నావుంటే, ఆ విరోధం కొద్దీ మేనల్లుడిమీద అభాండాలు వేశాడనుకోవచ్చు. అదేమీ కాదు. ఏకాంబరప్ప చిన్నప్పటి నుంచీ మేనమామల దగ్గరే పెరిగాడు.

జరిగిందేమిటంటే-

ఏకాంబరప్ప తండ్రి పేరు దాసప్ప. ఆయన మాటకారి. తెలివిగల వాడు. చదువు సంధ్యలు బొత్తిగా లేనివాడు. పొలం పుట్రా అసలే లేనివాడు. అయినా ఆర్థికంగా దాసప్పగారెప్పుడూ అవస్థపడలేదు. ఆయన ఖాయిదాబేరం చేసేవాడు.

"అంటే మరేం లేదండీ! ఎవరికన్నా పాడి బర్రెకావాలనుకోండి. మా బావతో చెబుతారు. ఇంకెవరన్నా బర్రెను అమ్ముకోవాలనుకోండి. అదీ మా బావతో చెబుతారు. ఈ ఇద్దరి అవసరాలూ మా బావ తీరుస్తాడు. అమ్ముకొనేవాడితో 'నీ గేదెకు పాడిచార లేదయ్యా! ధర పలకదు' అనేవాడు. కొనుగోలుదారుతో "మంచి కులంగల గొడ్డు. సుడులు కూడా బాగా వున్నాయ్. మణుగు చట్టం చూస్తే తెలియదా! నువ్వు అడిగిన ధరకు ఆ బర్రెకొమ్ముకూడా రాదు. పది రూపాయలు పోతేపోయినయ్. గుట్టు చప్పుడు కాకుండా కొనుక్కో' అని సలహా యిచ్చేవాడు. నేను సరిగ్గా చెప్పలేకపోతున్నానుగానండీ, మా బావ చెబుతుంటే అక్షరాలా నిజమేననిపిస్తుంది. ఎక్కడ తొణకడు బెణకడు. ముఖం చూసి ఆయన కడుపులో వున్నదేమిటో కనుక్కోవడం హరి హరాదులక్కూడా సాధ్యం కాదు" అన్నాడు నరసప్ప.

అటు అమ్మకందారు దగ్గిరా, ఇటు కొనుగోలుదారు దగ్గిరా ఆయన సంపాదించేవాడు. రూపాయికి అణా పట్టంతో ప్రారంభించి, ముక్కానికి బేరం కుదిర్చేవాడు. నలభయ్ రూపాయల బేరం కుదిర్చేవాడు. నలభయ్ రూపాయల బేరం ఫైనలయితే, నలభయ్ కాన్లు- పదణాలు ఘల్లున చేతిలో పడేవి. ఇటు పదనాలు, అటు పదణాలు, వెరసి రూపాయిపావలా, ఒక్క రూపాయికి నాలుగు మాణికెల బియ్యం దొరికే రోజుల్లో, రూపాయి పావలా తక్కువ సంపాదనేం కాదు. ఖర్చులు పోగా ఆయన నిలవచేసుకుంటే బోలెడంత డబ్బు ఆయన దగ్గిర వుండవలసింది. కానీ, వచ్చింది వచ్చినట్టుగా ఆయన సారాకొట్టుకు అర్పితం చేసేవాడు.

ఏకాంబరప్పకు మూడో ఏడు వెళ్ళేటప్పటికి అతని తల్లి చచ్చిపోయింది. నలుగురు అన్నదమ్ముల మధ్య ఒక్కతే ఆడపిల్ల. అందుకని, నరసప్ప గారు మేనల్లుడ్ని తమ దగ్గరకు తీసుకొచ్చుకున్నారు. ఇది జరిగిన ఆరేడు మాసాలకల్లా దాసప్పగారు మళ్ళీ పెళ్ళి చేసుకున్నారు. ఈ రెండో భార్యకు అయిదుగురు పిల్లలు కూడా.

"అప్పుడప్పుడు మా బావ మా ఇంటి కొస్తుండేవాడు. కొడుకును చూసుకునేవాడు. వాడికి అ వీ ఇవీ కొనిచ్చి, పోతూ ఉండేవాడు... తప్పేం లేదనుకోండి తల్లిలేని వాడు కావడంతో ఏకాంబరప్పను

మేం మరీ గారాబంగా పెంచేవాళ్ళం. మా అమ్మకయితేనండీ- వీడంటే పంచప్రానం. వీడు ఆడిందే ఆట- పాడిందే పాట. ఏడెనిమిదేళ్ళ వయస్సు వచ్చేదాకా వీడికి అక్షరం ముక్క రాదు. ఇప్పటి సంగతి వేరులెండి'' అన్నాడు నరసప్ప మేనల్లుడికేసి గర్వంగా చూస్తూ.

ఏకాంబరప్ప నలుగురు మేనమామల మధ్య పెరిగాడు. తోబుట్టువు మీది ఆపేక్షకొద్దీ అతన్ని ఎవరూ ఏమీ అనేవారు కాదు. మరీ అల్లరి మితిమీరినప్పుడు కాస్త నోరు చేసుకుంటే ముసలమ్మ గయ్ మని ఒంటికాలిమీద లేచేది.

అతడు బళ్ళోకి వెళ్ళడం గొప్ప. వెళ్ళినా కూచునేవాడుకాదు. అయ్యవారు చెప్పేది వినేవాడు కాదు. దిద్దబెట్టిన అక్షరాలు దిద్దేవాడు కాడు. అనేకసార్లు బళ్ళోకి పోతున్నానంటూ ఇంటి దగ్గర చెప్పి ఏటో తిరిగేవాడు. ఎక్కడికెళ్ళేవాడో ఎవరికీ తెలియదు. బడి విడిచి పెట్టే వేళకు మళ్ళీ కొంపకొచ్చేవాడు.

''కొండమీది కెళ్ళేవాణ్ని. కొనేట్లో ఈత కొట్టేవాణ్ని. కొండకింద చెన్న కేశవస్వామివారి గుడి వుంది. నేనూ, శంకర్రావూ, ఆ గుళ్ళో కూచుని బీడీలు కాల్చేవాళ్ళం. సిగరెట్లు కాల్చేవాళ్ళం. నోరువాసన వస్తుందేమోనని భయం. అందుకని, తులిశాకు నమిలేవాళ్ళం... శంకర్రావు చాలా మంచివాడు సార్- అప్పుడప్పుడు ఇంట్లోంచి డబ్బులు కాజేసి తెచ్చేవాడు. డబ్బులు దొరకనప్పుడు లాగు జేబుల్లో బియ్యం పోసుకొచ్చి రత్తయ్య కొట్లో అమ్మేవాడు. ఆ డబ్బుతో బీడీలు కాల్చేవాళ్ళం. చదువుకో బుద్ధయ్యేదికాదు. బండచదువు, బండబాదుడు. మా పంతులుగారు కోదండం తీయించేవాడు. చెర్నాకోలతో కాళ్ళమీద కొట్టేవాడు. బల్లమీద ఒంగోపెట్టేవాడు గోడకుర్చీ వేయించేవాడు. నా కర్మకాలిపోతే, నాకు చదవబుద్ధయ్యేదికాదు. గంటకింద చదివింది ఇప్పుడు గుర్తుండేది కాదు...'' అన్నాడు ఏకాంబరప్ప తన చిన్నప్పటి సంగతులు గుర్తు చేసుకుంటూ.

శంకర్రావయితే దొంగతనం చేశాడు కానీ, తనెప్పుడూ చేయలేదన్నాడు ఏకాంబరప్ప. ఆ అవసరం తనకు లేదన్నాడు. అడిగినప్పుడల్లా మేనమామలిస్తూండేవారనీ, వారూ ఇవ్వనప్పుడు, అమ్మమ్మ ఇస్తూ ఉండేదని అన్నాడు. కొంతకాలం ఓ ఫొటోగ్రాఫర్ దగ్గిర పనిచేశాడు. ఇంకొంతకాలం నాపరాళ్ళ షాపులో పనిచేశాడు. సొంతంగా, కిళ్ళీ కొట్టు పెట్టి చూశాడు. అన్నీ ఎదురు తిరిగాయి. ఏ వృత్తీ అతనిని నచ్చలేదు.

''ఒకసారి సంగమేశ్వర స్వామి తిరనాళ్ళకెళ్ళా. గాసులైట్ల ముందు - నిగనిగలాడుతున్న పాంటును, వేలం వేస్తున్నారు. అయిదు రూపాయలతో పాట మొదలు, ఇంకెవరో అయిదుంబావలా అన్నారు. నా పక్కకు నుంచున్నవాడు 'ఆరు' అన్నాడు. నేను ఏడు రూపాయలని అన్నాను... ఇలా పెరిగి పెరిగి పద్దెనిమిది రూపాయలకు నేను కొన్నాను. ఇంటికొచ్చాను. అమ్మమ్మకు చూపించాను. నా తెలివి తక్కువకు ఆవిడ గోల పెట్టి ఏడ్చింది. మా చిన్న మేనమామ కిష్టప్ప- 'దేంట్లోనన్నా దూకి చవరాదురా! మా ప్రాణానికొచ్చి పడ్డావ్' అన్నాడు. ఆనాడు ఆ సంఘటనే జరక్కపోతే, నా బతుకు ఇంకోలాగా ఉండేది. ఎలా వుండేదో నాకు తెలియదు'' అన్నాడు ఏకాంబరప్ప హాయిగా నవ్వుతూ.

అమ్మమ్మ- కొడుకులకు తెలియకుండా పులిచేరునాకు, గోట్లు తీసి మనవడి చేతిలో పెట్టింది. వాటిని కర్నూలులో అమ్మాడు. ఆ అమ్మకంలో కూడా ఏకాంబరప్ప మోసపోయాడు. అమ్మిన డబ్బుతో చీరెలు, రవికల గుడ్డలు కొన్నాడు. కొన్నదానిమీద రూపాయికి పావలా లాభం వేసుకొని ధరలు

చెప్పేవాడు. కానీ అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉండేవి. ఇది పనికిరాదు అనుకొని 'వేలం' పద్ధతి ప్రారంభించాడు. గుడ్డ నాణ్యం కన్నా తళుకుబెళుకులు ఎక్కువగా ఉండాలని అనుభవంమీద గ్రహించాడు. గిట్టిన రేటుతో  పాట ప్రారంభమయ్యేది. ఆపైన ఎక్కువ అమ్మిందంతా లాభమే.

"ముందుగా ఇందులోనూ నష్టాలొచ్చాయి. అయినా నిలదొక్కుకున్నాను... మరీ మీరు మా బిజినెస్ సీక్రెట్స్ అన్నీ అడుగుతున్నారు సార్. మీరు ఈ ఫీల్డులో లేరు గనుక చెబుతున్నా. వేలం పాట బాగా నడపాలంటే, అయిదారుగురు కలిసికట్టుగా ఉండాలి. ఒకడు పాట పాడుతూ ఉండాలి. మిగిలినవాళ్ళు కొనుగోలుదార్ల మధ్య అక్కడక్కడా వుండి పాటను పెంచుతూ పోవాలి. అసలు ఏ వస్తువును పాటకు పెట్టడానికయినా ముందు దాన్ని గురించి బాగా చెప్పాలి. నాణ్యం ఎవడిక్కావాలి సార్! ఈ రోజుల్లో కంటికి నదరుగా వుండాలిగానీ, పాట పెరుగుతున్న కొద్దీ ఆశగా మరీ పెంచకూడదు. అనుకున్న లాభం రాగానే, ఒకసారి, రెండుసార్లు, మూడుసార్లు...అంటూ పాట కొట్టెయ్యాలి. ఒక్కోసారి ఓ చీరమీద లాభం వస్తూన్నా, కొనుగోలుదారు కోసమని, లాభంకావాలా? వస్తువు కావాలా? అని అడుగుతా లాభం కావాలన్నాడనుకోండి- మూడు నాలుగు లాభం అతనికిస్తా. సాధారణంగా లాభం కావాలనే వాళ్ళు మా వాళ్ళే అయి వుంటారు. అప్పుడప్పుడు పరాయివాళ్ళు కావచ్చు. అయినా లాభం అతనికి ఇచ్చేస్తా. అదండీ! డబ్బు వ్యాపారం మరి!" అన్నాడు ఏకాంబరప్ప.

అతను బొంబాయి, అహమ్మదాబాద్, బెంగుళూరు, గద్వాల, పోచంపల్లి చీరాల తరచుగా పోతుంటాడు. కావలసిన గుడ్డల్ని చౌకగా కొంటాడు. ఒకప్పుడు చీరెలు, జాకెట్ గుడ్డలు మాత్రమే అమ్మేవాడు. ఇప్పుడు పాంటు గుడ్డలు, షర్టుగుడ్డలు, ధోవతులు బెడ్‌షీట్లు కూడా అమ్ముతున్నాడు.

"మా అమ్మమ్మ చచ్చిపోయింది. మా మామయ్యలందరూ ఇప్పుడు నాతోనే వుంటున్నారు. అందరం కలిసే ఈ వ్యాపారం చేస్తున్నాం. ఆదాయాన్ని గురించి అడక్కండి. ఆ సంగతి మీరడక్కూడదు. నేను చెప్పకూడదు... లేదండీ! ఎక్కువగా బస్తీల్లోనే ఈ బిజినెస్ సాగుతుంది. రాత్రిళ్ళుఎందుకంటే - గుడ్డల్లో ఎక్కడన్నా, ఏదన్నా..." అని తక్కున ఆగిపోయాడు ఏకాంబరప్ప.

"ఇప్పటికే చాలా చెప్పాను. నిజానికి ఇవన్నీ చెప్పకూడదు...పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు. ఒక్క ఊరనేదేమీ లేదు. ఈ ఊరొచ్చి పదిరోజులయింది. ఇంకా పది, పదిహేనురోజులు ఇక్కడే వుంటాం...మళ్ళీ ఇంకోచోట... నేను కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడుల్లో కూడా తిరుగుతాను.." అన్నాడు ఏకాంబరప్ప.

అతనిప్పుడు అయిదారు భాషలు అనర్గళంగా మాట్లాడుతాడు. మాట్లాడి చూపించాడు కూడా.

జీవిత పుటంలో జిగ్రకాగి, నిగ్గుతేలిన మేలిమి శలాకలాంటి వాడు ఏకాంబరప్ప.